## మరో రైతు ఆత్మహత్య

- కాలం కలిసి రాక.. అప్పులు తీర్చలేక
- భద్రాద్రి జిల్లాలో విషాదం
- మృతుడు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు

దమ్మపేట రూరల్, ఏప్రిల్ 16 : కాలం కలిసి రాక.. అప్పులు తీర్చలేక మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన రైతు మడిపల్లి శ్రీనివాసరావు (47) తనకున్న ఐదెకరాలతోపాటు 30 ఎకరాలు కౌలుకు చేస్తున్నాడు. చెరుకు, వరి, ఆయిల్ పామ్ పంటలు సాగుచేస్తున్నాడు. ఆశించిన దిగుబడులు రాకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రూ.కోటికి పైగా అప్పులయ్యాయి. అటు వ్యవసాయం కలిసిరాక.. ఇటు తెచ్చిన అప్పులు తీర్చే దారిలేక మనస్తాపం చెందిన శ్రీనివాసరావు మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో కలుపుమందు తాగాడు. బుధవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లి దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే శ్రీనివాసరావు మృతిచెందినట్టు తెలిపారు. శ్రీనివాసరావు గతంలో మందలపల్లి ఎంపీటీసీగా ఎన్నికై మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా పనిచేశాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

### ఆరు రోజులపాటు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల చక్రవాత ఆవర్తనం బుధవారం బలహీనపడింది. దీని ప్రభావంతో రాబోయే ఆరు రోజులపాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే 3 రోజులు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. గురువారం జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కి.మీ వేగంతో కూడిన ఈదురుగాలుల వాన కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది.

# అబద్ధాలు ఆపి.. తాగునీరు ఇవ్వండి

- నిర్లక్ష్యంతో కరువు తీసుకొచ్చిన కాంగ్రెస్ సర్కారు
- నల్లాలతో ఇండ్లకు నీటి సరఫరా చేయని ప్రభుత్వం
- బిందెలు, డ్రమ్ములతో రోడ్డెక్కుతున్న ప్రజానీకం
- మిషన్ భగీరథ నిర్వహణలో రేవంత్ సర్కార్ విఫలం
- నిప్పులుచెరిగిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ 16 నెలల పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి దుస్థితి కనిపిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో మిషన్ భగీరథ కార్యక్రమంతో నల్లాల ద్వారా ఇంటింటికి తాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ పాలనలో బిందెలు, డ్రమ్ములతో జనం రోడ్డెక్కుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నిర్వహణ వైఫల్యంతో ప్రభుత్వం నల్లాల ద్వారా నీళ్లు సరఫరా చేయలేని దీనమైన పరిస్థితి ఎదుర్కొంటున్నదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ఇన్నాళ్లు సాగునీళ్ల కోసం రైతుల గోస.. ఇప్పుడు తాగునీళ్ల కోసం ప్రజల ఘోష!, కాంగ్రెస్ పాలనలో తడారిన పొలాలు.. ఎడారయిపోతున్న ప్రజల బతుకులు. ముందుచూపు లేమి, నిర్లక్ష్యంతో ప్రాజెక్టుల్లో నీళ్లు ఒడిసి పట్టలేదు, చెరువులు నింపలేదు, భూగర్భ జలాలు పెంచలేదు. మిషన్ భగీరథ ద్వారా నీళ్లు సరఫరా చేయడంలేదు. కేసీఆర్ ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేసి, తాగునీళ్లిస్తే.. రేవంత్ కనీసం ఆ పథకాన్ని కొనసాగించలేక పోతున్నప్పుడు.. ఉమ్మడి పాలన నాటి బిందెలు, డ్రమ్ములు మళ్లా రోడ్లపై కనిపిస్తున్నాయి. తెలంగాణ ఆత్మగల్ల పాలకుడికి, తెలంగాణ ప్రయోజనాలు పట్టని పాపాత్ముడికి ఉన్న తేడా ఇది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ కరువు. రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యం తెచ్చిన కరువు" అని హరీశ్‌రావు నిప్పులుచెరిగారు. ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు అబద్ధాల ప్రవాహాన్ని పారించడం మానేసి, ప్రజల ఇండ్లకు తాగునీటిని పారించాలని హితవు పలికారు.

# పంటలు వర్షార్పణం

- కల్లాల్లోని ధాన్యం, మిర్చి, మక్కలు వరదపాలు
- పలు జిల్లాల్లో వాలిపోయిన వరి, మక్క పంటలు
- ఈదురుగాలులకు చెల్లాచెదురైన కల్లాల్లోని పరదాలు
- కొన్నిచోట్ల నేలకూలిన స్తంభాలు, విరిగిపడిన చెట్లు
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కామారెడ్డి జిల్లాల రైతులు ఆగం





ఖమ్మం జిల్లా బోనకల్లులో నేలవాలిన మక్కజొన్న పంట..., కామారెడ్డి జిల్లా పోతాయపల్లిలో కొట్టుకుపోయిన వడ్లను కుప్ప చేస్తున్న రైతులు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 16: ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు అకాల వర్షం కన్నీళ్లు తెప్పించింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కామారెడ్డి జిల్లాల్లో దెబ్బతిన్న పంటలతో రైతులు తల్లడిల్లిపోయారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కాంటాలకు సిద్ధంగా ఉన్న ధాన్యంపై అడుగు మేర నీళ్లు చేరడంతో అన్నదాతలు ఆ నీళ్లను బకెట్లతో ఎత్తిపోశారు. అర్ధరాత్రి కావడంతో ఎక్కువమంది రైతులు ఆరబెట్టిన ప్రదేశాలకు చేరుకోలేకపోయారు. ఖమ్మం రూరల్ మండలంలో కొద్దిరోజుల క్రితమే నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. గన్నీబ్యాగుల కొరత, కాంటాల ప్రక్రియ ఆలస్యం కారణంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాసులు పోటెత్తాయి. అర్ధరాత్రి మొదలైన వర్షాన్ని కూడా లెక్కచేయకుండా రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు తెచ్చుకున్న కొద్దిపాటి పరదాలను పంటలపై కప్పి వాటిని కాపాడుకునే ప్రయత్నం చేశారు. తిరుమలాయపాలెం, దుమ్ముగూడెం మండలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వడ్లు రాలిపోయాయి. మధిర, బోనకల్లు, చింతకాని మండలాల్లో మక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్నది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మక్కజొన్న పంటలు తడిచిపోయాయి. అశ్వారావుపేట, దమ్మపేటల్లో పది రోజులుగా రోజు విడిచి రోజు వర్షం కురుస్తూ రైతులకు నష్టాన్ని మిగుల్చుతున్నది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి, వీచిన ఈదురుగాలులకు విద్యుత్తు స్తంభాలు కూలాయి. దీంతో సరఫరా నిలిచిపోయింది. చెట్లు కూడా విరిగిపడ్డాయి. చేతికొచ్చిన మక్కజొన్న నీటిపాలైంది. మామిడి, పొగాకు, మునగ, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పలువురి ఇండ్లు దెబ్బతిన్నాయి.

**ఉమ్మడి వరంగల్‌లో తడిసిన ధాన్యం..**

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ ఈదురుగాలులతో వడగండ్ల వర్షం కురిసింది. వరి, మక్కజొన్న, అరటి, బొప్పాయి తోటలు నేలమట్టమయ్యాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఆరబోసిన మక్కజొన్నలు కొట్టుకుపోయాయి. కల్లాల్లోని మిర్చి తడిసిపోయింది. చెట్లు కూలగా, విద్యుత్తు స్తంభాలు విరిగిపడటంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో విద్యుత్తు వైరు తెగిపడటంతో నాగెల్లి ఉప్పలమ్మ(65) కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పలు చోట్ల ఇండ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో పిడుగు పాటుకు రెండు దుక్కిటెద్దులు మృత్యువాతపడగా, నర్సింహులపేటలో కరెంట్ షాక్‌తో రెండు ఆవులు చనిపోయాయి.

### కామారెడ్డి జిల్లాలో కొట్టుకుపోయిన ధాన్యం

కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలో బుధవారం మధ్యాహ్నం అరగంటకుపైగా కురిసిన అకాల వర్షం రైతులను ఆగం జేసింది. కోమట్‌పల్లి, పోతాయిపల్లిలో ధాన్యం రాశులు తడిసిపోయాయి. వరద నీటి ప్రవాహానికి వడ్లు కొట్టుకుపోయాయి. వడగండ్లు పడటంతో గింజలు రాలిపోయాయి. మరోవైపు కుప్పపోసిన వడ్లలోకి నీళ్లు చేరాయి. కొనుగోలు కేంద్రాల్లో కాంటా ప్రారంభించక పోవడంతో ధాన్యం రాశులు పేరుకుపోయాయని, అకాల వర్షాల వల్ల కుప్పల్లోకి నీరు చేరిందని రైతులు వాపోయారు. పోతాయిపల్లిలో ఆరబెట్టిన ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. కొట్టుకుపోయిన ధాన్యాన్ని దోసిళ్లతో ఎత్తారు.

## స్థానికులకు 25% రిజర్వేషన్లు కల్పించాలి

- తెలంగాణ ప్రాంత విద్యా అవసరాలను తీర్చాలనే ఆర్టికల్ 371-ఈ కింద హెచ్‌సీయూ ఏర్పాటు
- హెచ్‌సీయూ వీసీకి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వినతి



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రవేశాల్లో స్థానిక విద్యార్థులకు 25% రిజర్వేషన్లు కల్పించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు, రిజిస్ట్రార్ దేవేశ్‌నిగమ్‌కు వినోద్‌కుమార్ బృందం వినతిపత్రం అందజేసింది. తెలంగాణ విద్యా అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 371-ఈ కింద స్థాపించిన ఏకైక కేంద్ర విశ్వవిద్యాలయం హెచ్‌సీయూ అని గుర్తుచేశారు. 1969లో తెలంగాణ తొలి ఉద్యమం తర్వాత ఆరు సూత్రాల పథకంలోని ఆర్టికల్స్ 371-డీ, 371-ఈలను రాజ్యాంగంలో చేర్చినట్టు తెలిపారు. తొలిదశ ఉద్యమంలో 360 మంది విద్యార్థులు, యువత ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ, పాండిచ్చేరి యూనివర్సిటీల్లో ఇప్పటికే స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్లు అమలవుతున్నాయయని, ఇక్కడ కూడా అమలు చేసేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టంచేశారు. రాష్ట్ర సామాజిక-విద్యా వాస్తవాలను గుర్తించి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వినోద్‌కుమార్ వెంట బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, విద్యార్థి నాయకుడు విశాల్, హెచ్‌సీయూ ఇన్‌చార్జి అభినేశ్, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ కిరణ్‌కుమార్, మురళీ యాదవ్ ఉన్నారు.

## వీడీసీల పేరిట రాజ్యాంగేతర శక్తులు

కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ల పేరిట రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్‌గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. దళితులు, బలహీనవర్గాలను సాంఘిక బహిష్కరణలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ అధ్యక్షతన వివిధ సామాజిక, గౌడ సంఘాలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పల్లె రవి మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్‌లో ఆరు నెలలుగా కల్లుగీత కార్మికులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వీడీసీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీరామనవమి సందర్భంగా గౌడ మహిళలను గుడి నుంచి గెంటివేసి, ఈత చెట్లను కాల్చివేసిన దుర్మార్గులను తక్షణమే అరెస్టు చేయాలని, వీడీలను నిషేధించాలని డిమాండ్ చేశారు.

## తడిసిన ధాన్యం.. ఏదీ పరిహారం?

సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై రైతుల బైఠాయింపు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 16: ఈదురుగాలులు, వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లాలో రైతులు రోడ్డెక్కారు. ఆత్మకూర్.ఎస్ మండలంలోని పాతర్లపహాడ్ స్టేజీ వద్ద సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై బుధవారం బైఠాయించారు. ఇస్తాళాపురం, పాతర్లపహాడ్, ముక్కుడుదేవులపల్లి, కొత్తతండా, బోరింగ్ తండా గ్రామాల పరిధిలో 2 వేల ఎకరాలకుపైగా వరి పంట నేల పాలైనా.. అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేయకపోవడంతో వర్షానికి తడిసిపోయిందని వాపోయారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి దివ్య, ఆర్ఐ స్వప్న హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.